# అతివల ఆత్మబంధువు - శ్రీ కందుకూరి

**-- చల్లా సత్యవతి, Matawan, NJ**

మన పవిత్రగోదావరికి గొప్ప చరిత్ర వున్నది. ఈ నదీ తీరమున ఎన్నో సంస్కృతులు, లలితకళలు దినదినాభివృద్ధి చెందుతూ నిత్యనూతనంగా నిలిచాయి. అట్టి గోదావరీ తీరాననున్న రాజమహేంద్రవరం పురాతనమైనదేకాక ప్రశిద్ధమైనది కూడా.

తొమ్మిదివందల సంవత్సరాల క్రితం ఆ పట్టణాన్ని పరిపాలించిన రాజరాజనరేంద్రుడు వ్యాసప్రణీత మహాభారతాన్ని ఆంధ్రీకరించడానికి ప్రోత్సాహమిచ్చాడు. నన్నయభట్టారకుడు ఆ ఆదికావ్యాన్ని తీయని తెలుగు పద్యాలలోనికి అనువదించి తెలుగు భాషకు అనన్యసేవ చేసి, ఆదికవిగా చరిత్రలో నిలిచాడు. ఆనాడు పాదుకున్న సాహిత్యవృక్షం కొమ్మలతో, పూలతో, ఫలాలతో దినదినాభివృద్ధి చెందుతోంది.

కవివరులు చిలకమర్తి, వేంకటపార్వతీశకవులు, విశ్వనాథ వంటి కవులే గాక, కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, చలం మొదలగు సంఘసంస్కర్తలు మన పుణ్యభూమిపై వెలిశారు.

నవయుగ పురుషుడు కందుకూరి వీరేశలిగం తెలుగు భాషకు, సమాజానికి, ముఖ్యంగా స్త్రీలకు అమూల్య సేవ చేసిన మహా మనీషి. అప్పటి వ్యవస్థలో బాధిస్తున్న అవినీతి, మూఢవిశ్వాసాలు, స్వార్ధపరత్వం అనే రుగ్మతలను రూపుమాపడాన్కి తన జీవితకాలమంతా శ్రమ పడిన త్యాగశీలి. ఆనాడు స్త్రీలకు జరుగుతున్న ఘోర అన్యాయాలను గుర్తించి ఎన్నో కష్టనిష్టూరాలను భరించి మహోపకారం చేశాడు. అట్టి మహా వ్యక్తిని గురించి నాకు అవగతమైన కొన్ని విషయాలను, సంఘటనలను మీతో పంచుకోవాలనే నా ప్రయత్నంలో ఏమైనా పొరపాట్లుంటే మన్నించ ప్రార్ధన.

కందుకూరివారు వీరశైవ మతస్థులు. వీరినే లింగధారులని కూడా అంటారు. మగవారంతా మెడలో శివలింగాలను ధరించి, నిష్టగా పూజ చేస్తారు. మన వీరేశలింగం తాతగారు రాజమండ్రి వాస్తవ్యులు. వారు లింగకాయలు అనవసరమని భావించి, తీసివేయడంతోనే వారి కుటుంబంలో సంస్కరణ మొదలైనది. వీరేశలింగం 1848 సం. లో రాజమండ్రిలో సుబ్బారాయుడు, పున్నమ్మ దంపతులకు జన్మించాడు. బాల్యంలోనే తండ్రిని పోగొట్టుకున్న ఇతనిని తల్లి, తాతగారు, నాయనమ్మా పెంచి పెద్దచేశారు. చిన్నప్పుడు అనారోగ్యాలతో బాధపడుతున్న యితను బ్రతికి, వెలుగు చూస్తాడా అని భయపడేవారు. కాని, ఎందరో దీనుల బ్రతుకులలో వెలుగు చూపించడాన్కి డెబ్భై సంవత్సరాలు జీవించాడు.

ఇతనిని ఏడేళ్ళకు వీధిబడిలో వేశారు. బాలరామాయణం, అమరకోశం, సుమతీశతకం వల్లె వేయించారు. అతని కాలమంతా ఏకాదశ వ్రతాలతోను, సహస్రగాయత్రీ జపాలతోనూ గడిచేది. ఎన్ని తప్పులు చేసినా భగవన్నామం జపిస్తే చాలు, పాపాలన్నీ పోతాయని యితని నమ్మకం. చాలా తెలివైన వ్విద్యార్ధి అవడం వలన ఏ పాఠమైనా సరే ఒకసారి చదివితే కంఠోపాఠమయ్యేది. గురువులు "ఏక సంధాగ్రాహి" యని మెచ్చుకునేవారు. అంతేకాదు, అతనికి విద్యపై అపారమైన శ్రద్ధ, అభిలాష. మూడవ తరగతి చదువుతుండగా అటకపైనున్న తాటాకు గ్రంధాలను దింపి చదివేవాడు.

'వసుచరిత్ర' చాలా గొప్ప కావ్యమని విని, ఎలాగైనా సరే అది చదవాలని అతనికి తీవ్రకాంక్ష కలిగింది. కాని, ఆపుస్తకం వెల నాలుగు రూపాయలు. తల్లి ఈయలేదు. పుస్తక విక్రేత ఆ పిల్లవాని ఆసక్తికి ముచ్చటపడి, అతని వద్దనున్న రూపాయి తీసికొని, ప్రతిరోజు తన షాపులో కూర్చొని చదువుకొని డబ్బు సమకూర్చుకొని యిచ్చే ఏర్పాటు చేశాడు. వీరేశలింగం మహదానందంతో బడికి ఎగనామం పెట్టి, పూర్తిచేశాడు. తల్లి తెలుసుకొని, అతని శ్రద్ధను మెచ్చి ఆ పుస్తకం కొని యిచ్చింది. ఈ కారణంగా క్లాసులోని పాఠాలను అశ్రద్ధ చేయలేదు. అన్ని సబ్జక్టులలోను, సత్ప్రవర్తనలోను కూడ అతనే మొదటివాడుగా నిలిచేవాడు.

వీరేశలింగమునకు పదమూడవఏటనే తొమ్మిది సంవత్సరాల బాపమ్మతో వివాహం చేశారు. వధూవరులచేత రుక్మిణీకల్యాణం పద్యాలు చదివించి పెద్దలు ముచ్చట పడ్డారు. అత్తగార్కి కోడలు పేరు నచ్చక "రాజ్యలక్ష్మి" అని నామకరణం చేసింది. ఆ రాజ్యలక్ష్మియే సంఘసంస్కర్త, ఆదర్శపురుషుడైన భర్తకు కుడిభుజమై ఎన్నో సత్కార్యాలను చేసి "సహధర్మచారిణి" గా నిరూపించుకుంది.

వీరేశలింగం 1870 లో మెట్రిక్యులేషను పూర్తిచేసి కోరంగి గ్రామంలో స్కూల్లో ప్రధానోపాధ్యాయునిగా జేరాడు. క్రమంగా, పూర్వం తనకున్న ఛాందసభావాలన్నీ నశించాయి. మంచిరోజులు, చెడ్డరోజులు, శకునాలువంటి నమ్మకాలకు ఆధారంలేదని వాటిని ఖండించాడు.

అమావాస్య రోజున కొత్త వుద్యోగంలో చేరాడు. ఒకసారి వారి పెరట్లో అరటిచెట్టుకు ప్రక్కనుండికాక, మధ్యనుండి గెల వచ్చింది. జ్యోతిష్కులు, ఇరుగుపొరుగులు వెంటనే కొట్టించకపోతే అరిష్టం జరుగుతుందని భయపెట్టారు. అతను ఏమాత్రం లెక్కచేయక, గెలను చక్కగా పండనిచ్చి, ఉపయోగించుకొని, తనకేమీ అరిష్టం జరగలేదని ప్రజల్ని నమ్మించాడు. ఏవిషయాన్నీ సత్యాసత్యాలు తేలకుండా నమ్మేవాడు కాదు. పూర్వపు నమ్మకాలకు స్వస్తి చెప్పాడు.

19వ శతాబ్దం మొదట్లో మనదేశపు సాంఘిక పరిస్థితులు దుర్భరంగా వుండేవి. మూఢనమ్మకాలను ప్రజలందరూ నమ్మేవారు. ఇంచుమించుగా ప్రతి యింటినీ భూతం ఆవహించి వున్నదని భయపడేవారు. వీరేశలింగం తల్లి పున్నమ్మను భూతం పీడిస్తోందని భూతవైద్యుని పిలిపించింది. అతను వారింట్లోనే తిష్టవేసి డబ్బు గుంజనారంభించటం వీరేశలింగం గమనించాడు. మా అమ్మకు పూర్తిగా నయమైతేనేగాని, చిల్లిగవ్వకూడా ఇవ్వనని తెగేసి చెప్పి, ఇంటినుండి గెంటించాడు. అతని మోసం బయటపడ్డాక అందరికీ కనువిప్పు అయింది. నమ్మకాలు తగ్గాయి. అంతేకాదు కొందరు స్వార్థపరులు సమాజంలో చీడపురుగులుగా వ్యాపించి నాశనం చేయసాగారు. సామాన్యులు ఎన్నో ఇబ్బందులు పడేవారు. లంచగొండితనం, వేశ్యాలోలత్వం విజృంభించాయి. పెద్దమనుష్యులుగా చెలామణి అయ్యేవారు వాటిని ఘనకార్యాలుగా తలిచేవారు. ఫలానా ప్లీడరుగారు దక్షిణపు వీధిలో వైభవంగా కన్నెరికం జరిపించారని పత్రికలో గొప్పవార్త! పెళ్ళిళ్ళలో భోగం మేళాలు, వేశ్యలకు కట్నాలు చదివించడాలు సామాన్యం అయ్యాయి. ఇంకా విచిత్రమేమిటంటే "న్యాయాధిపతిగారు ప్లీడరు పట్టాలు ఇస్తున్నారు. నల్లకోటు కోటు కుట్టించుకుని రండి" ఇవీ వార్తలు ఆనాడు.

ఆడపిల్లలు అసలు చదువుకోకూడదు. వారిని అజ్ఞానంలోనే వుండనీయాలి. ఇంటిచాకిరీతోనే మగ్గిపోవాలి. ఇవీ ఆనాటి స్వార్థపరులైన ఛాందసుల తీర్పులు. ముక్కుపచ్చలారని బాలికలకు వృద్ధులతో వివాహాలు జరిపించడంవలన వారు త్వరలోనే వితంతువులుగా మారి పుట్టింటికి చేరేవారు.

అంత చిన్నవయస్సునుండి బంధువుల ఇళ్ళల్లో వంటలక్కలుగా మారి అనేక బాధలను భరించేవారు. ఈ దురాచారాన్ని గురించి గురజాడవారు "కన్యాశుల్కం" నాటికలో విశదీకరించారు కదా! 1881 జనాభా లెక్కల ప్రకారం తెలుగు దేశంలో నలభై లక్షలు బాలవితంతువులున్నారని తేలింది. ఎక్కువగా అగ్రవర్ణాలకు చెందినవారేనన్న విషయం గమనార్హం.

సుమారు ఒకటిన్నర శతాబ్దాలక్రితం మన సమాజపు పరిస్థితులు ఎంత ఘోరంగా వుండేవో చదివితే గుండె చెరువవుతుంది. ఆనాడు బాలికలు అనుభవిస్తున్న హృదయవిదారకమైన నిర్బంధ వైధవ్యాన్ని గమనించి వీరేశలింగం తల్లడిల్లిపోయి ఎన్ని కష్టాలనైనా ఎదుర్కొని, వారి జీవితాలను సరిదిద్దాలనే నిశ్చయానికి వచ్చి, పట్టుదలతో సాధించాడు.

స్వార్థపరుల మోసాలను, దౌర్జన్యాలను ఎదుర్కోగల వజ్రాయుధం వంటి "వివేకవర్ధని" అనే పత్రికను స్థాపించాడు. 1876 లో ధవళేశ్వరంలో తన యింట్లోనే ముద్రింపజేయప్రారంభించాడు. ఈ పక్షపత్రికలో న్యాయవాదుల అన్యాయాలు, పోలీసుల దౌర్జన్యాలు, అధికారుల దురాగతాలు అన్నీ బైలు పడేవి. దానికి అనుబంధంగా "హాస్యసంజీవిని" అనే పత్రికను కూడా ప్రచురించి దొంగస్వాముల మోసాలు, ఊళ్ళో పెద్దలు చేసే నీచకార్యాలను వ్యంగ్యంగా విమర్శించేవాడు. పిల్లలచే హాస్యనాటికలుగా వేయించి, వారందరూ సిగ్గుతో తలలు దించుకునేటట్లుగా చేసేవాడు. ఈవిధంగా ఎక్కడ అక్రమం జరిగినా సహించలేక, వెంటనే ప్రతిక్రియ జరగవలసినదే!.

సాహిత్యరంగంలోకూడా వీరేశలింగం కృషి, విజయాలు అసామాన్యమైనవి. అప్పటికి ఎవరూ ప్రయత్నించని ప్రక్రియలెన్నిటినో తెలుగులో ప్రారంభించాడు. ఆ కాలంలో నవలలు, కథలు, శాస్త్రీయగ్రంధాలుకూడ లేవు. 1878 సం. లో వీరేశలింగం నవలారచనకు పూనుకున్నాడు.

Goldsmith రచించిన "Vikar of wakefield" ఆధారంగా చేసుకొని "రాజశేఖరచరిత్రం" వ్రాసి తన పత్రికలో సీరియల్ గా ప్రచురించాడు. ఇది తెలుగులో మొట్టమొదటి నవల అయినా చాలా మంచి పేరు తెచ్చుకున్నది. దీనికి తమిళం, కన్నడం, ఇంగ్లీషు భాషలలోనికి తర్జుమాలుకూడా వచ్చాయి. ఆ సమయంలో అతడు ధవళేశ్వరంలో ఆచార్యపదవిలో వుండేవాడు.

Shakespear రచించిన నాటకాలను కొన్నిటిని అనువదించాడు. ముఖ్యమైనది "Merchant of Venice". "Comedy of Errors" అనే నాటకాన్ని ఆధారంగా తీసికొని "చమత్కార రత్నావళి" గా కూర్చాడు.

నీతిచంద్రికలోని "విగ్రహతంత్రం"రచనను చాలామంది పండితులు సహితం మెచ్చుకున్నారు. పిల్లలకోసం "సంగ్రహవ్యాకరణం", వారి

వినోదంకోసం నీతికథలపుస్తకాలు వెలువడ్డాయి. ఆవిధంగానే, స్త్రీలకోసం "సత్యవతీ చరిత్రము" అనే సాంఘిక నవలలో ఆదర్శ దాంపత్యాన్ని గురించి అనేక విషయాలు చెప్పారు. ఆకాలంలో ఎందరో తమ బిడ్డలకు "సత్యవతి" అనే పేరు పెట్టుకున్నారట! స్త్రీలకోసం ప్రత్యేకంగా ఒక పత్రిక నడిపించాడు. ఈ పత్రికద్వారా మహిళల విద్యా, విజ్ఞాన అభివృద్ధికోసం వారి కృషి అపూర్వము.

"The Gulliver's Travels" ఆధారంగా "ఆడమళయాళం", "లంకా యాత్ర" అను రెండు భాగాలుగా వచ్చాయి. అందులో సాంఘిక దురాచారాలను వేళాకోళంగా విమర్శించాడు. ఉదాహరణకు "ఆడమళయాళంలో భార్యలు చనిపోతే భర్తల ముక్కు, చెవులు కోసేవారట! పత్ని ఎంగిలి తినడం మోక్షప్రదం". ఈ విధంగా అప్పటి పరిస్థితులను వ్యంగ్యంగా విమర్శించేవాడు. వీరేశలింగం చివరి రోజుల్లో వ్రాసిన "కవుల చరిత్రలు" ముఖ్యంగా పేర్కొనతగినది. వీరేశలింగం ఏప్రక్రియ చేపట్టినా ఆయన లక్ష్యాలు రెండు. 1. స్త్రీ సంక్షేమం 2. సంఘంలో న్యాయవర్తనం వృద్ధిచేయడం.

ఆకాలంలో బెంగాల్ లో వున్న ప్రముఖులు రాజా రామమోహనరాయ్, కేశవచంద్రసేను, దేవేంద్రనాథటాగూరు బోధనలకు ప్రభావితుడై బ్రహ్మసమాజాన్ని అభిమానించాడు. విగ్రహారాధనను, కులమత వివక్షతలను నిరసించాడు. బ్రాహ్మణులు పవిత్రంగా ధరించే యజ్ఞోపవీతాన్నికూడా త్యజించాడు. వీరేశలింగం చేపట్టిన అన్ని సంస్కరణలకంటే వితంతువివాహాల విషయంలో ఎక్కువ శ్రమపడవలసి వచ్చింది. అతని ధైర్యసాహసాలు అద్వితీయం. మహాసముద్రంలో ఎదురీత ఈది తన లక్ష్యాలను సాధించగలిగాడు. ఈ విషయంలో మిత్రులు బసవరాజు గవర్రాజుగారు కుడిభుజమై నిలిచారు. కాకినాడ వాస్తవ్యులు, ఉదారస్వభావులు అయిన శ్రీ పైడా రామకృష్ణయ్య జమిందారు విరివిగా ధనసహాయం అందించారు.

కొందరు సంస్కరణాభిలాషుల సహాయంతో స్త్రీపునర్వివాహ సంస్థను స్థాపించాడు. బహిరంగోపన్యాసంలో వితంతువివాహం శాస్త్రసమ్మతమేనని స్పష్టంగా నిరూపించాడు. దేశమంతా వాదోపవాదాలతో అల్లకల్లోలమైనది. అయినా అతడు వెనుకంజ వేయలేదు. మొదటి వితంతు వివాహం 1881లో జరిపించాడు. రాజమండ్రినుండి బయలుదేరి కృష్ణాజిల్లాలోని ఒక గ్రామం నుండి పన్నెండేళ్ళ బాలికను తీసుకొనిరావడానికి పదిహేను రోజులు పట్టిందట! కాలినడకన, అతిరహస్యంగా, రాత్రివేళలలో ప్రయాణం చేశారట వధువు గౌరి, వరుడు గోగులపాటి శ్రీరాములు.

పోలీసుల సహాయం తీసికోవలసివచ్చింది. పెద్దపెద్ద అధికారులెందరో పెళ్ళి ఊరేగింపులో పాల్గొన్నారు. ఇది జరిగిన నాలుగోనాడు ఒక తల్లి తన పన్నెండేళ్ళ కూతురిని, భర్తకు కూడా తెలియకుండా తీసికొనివచ్చి పంతులుగార్కి అప్పచెప్పి కళ్ళు తుడుచుకుందట. రాజ్యలక్ష్మిగారు వారిని ఆదరించి ధైర్యం చెప్పడం, వెంటనే పెళ్ళి జరిపించడం, వింటేనే ఆశ్చర్యం వేస్తుంది. నాలుగు రోజుల వ్యవధానంలో ఇద్దరు వితంతువులు గృహిణులయ్యారు. ఊళ్ళోజనం ఎన్నో ఇబ్బందులు కలిగించారు. మంచినీళ్ళు కూడా అందకుండా చేసినా, శుభకార్యం నిర్విఘ్నంగా జరిగింది. మూడేళ్ళలో పన్నెండు పెళ్ళిళ్ళు చేయగలిగారు.

వీరేశలిగం పంతులుగారి ధైర్యసాహసాలను విజయాలను గుర్తించిన మహామహులెందరో వీరికి ప్రోత్సాహమిచ్చారు. బెంగాలీ సంఘసేవకుడు "కేశవచంద్రసేన్" అభినందనలను తెలిపారు. చివరి దినాలలో కొందరు మిత్రులు సహితం దూరమై వెలివేసినట్లు ప్రవర్తించినా, ఈ మహావ్యక్తి ఏమాత్రం నిస్పృహ చెందక జీవితాంతం శ్రమించి లక్ష్యాలను సాధించాడు. ఈ యుగపురుషుడు 1919 సం. లో భౌతిక శరీరాన్ని త్యజించి, అమరజీవిగా చరిత్రలో నిలిచాడు. ఈయన తన సమాధిపై "ఏకేశ్వరవిశ్వాసి" అని వ్రాయవలసిందిగా కోరాడట!

1935 లొ స్వస్థలమైన రాజమండ్రి నగరంలో వీరేశలింగంగారి శిలావిగ్రహం ప్రతిష్టింపబడటం, వీరిపేరున, రాజ్యలక్ష్మిగారి పేరున హైస్కూళ్ళు నిర్మింపబడటం ముదావహం. వీరి అనుయాయులు శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు గౌరవపూర్వకంగా ఇలా అన్నారు:

తనదేహము తనగేహము
తనకాలము తనధనము విద్యయు
జనులకు వినియోగించిన ఘనుడీ
వీరేశలింగకవి సుజనులార!

మహిళలకు మహోపకారం చేసిన ఈ మహామహునికి మనం శ్రద్ధాంజలిని ఘటిద్దాం.

శ్రీ అక్కిరాజు రమాపతిగారు రచన "నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం" అనే పుస్తకం ఆధారంగా వ్రాశాను. వారికి కృతజ్ఞతలు.

సర్వేజనా సుఖినోభవంతు.

*****